# కార్నర్ సీటు

స్టేషన్లో ట్రెయిన్ వచ్చి చాలా సేపయింది. ఇంక ఏ క్షణాన్న బయల్దేరిపోతుందోననే ఆందోళనతో, కుడిచేత్తో టిక్కెట్టూ, ఎడం చేత్తో తోలుసంచీ పట్టుకొని పరిగెట్టేడు రాజు ప్లాట్ ఫారంవైపు.

పచ్చకోటు తొడుక్కొని ముందుపోతూన్న ఆసామీని రాజు తోసేయబోతూంటే ఆ ఆసామీని టిక్కెట్టు అడక్కుండా, రాజునిమాత్రం ఆపేసి "ఎందుకలా గాభరా పడతావయ్యా? ఎక్కడానికి టైముందిలే" అని కసిరేడు టిక్కెట్టు కలెక్టరు.

టికెట్ కలక్టర్ ఆపినందుకూ కసిరినందుకూ కించపళ్ళేదు రాజు.

"ఆహా! ఇంకా టైముందండీ?" అని నిట్టూర్చి ప్రశ్నించేడు.

"ఓ, చచ్చినంత" అన్నాడు టీ.సీ. టిక్కెట్టు పంచ్ చేస్తూ.

పచ్చకోటు తొడుక్కున్నవాడు ప్లాట్ ఫారంలోకి ముందుగా పోయేడు. ఆ వెనకే రాజుకూడా వెళ్ళేడు.

మేనల్లుడి పెళ్ళికి వెళ్ళకపోతే బావుండదని బయల్దేరేడు. ఆ బండీ తప్పిపోతే ఇహ పెళ్ళికి వెళ్ళినట్టే! బండీ తప్పిపోయిందంటే అక్కయ్య నమ్మదు. బావకి కోపం వస్తుంది. పెళ్ళిళ్ళ రోజులవడంచేత ట్రెయిన్లో జనం కిటకిట లాడుతున్నారు. ఎక్కడా ఖాళీ ఉన్నట్టులేదు.

"ఏదో బండీ అంటూ దొరికింది. అదే పదివేలు. ఎక్కడో అక్కడ ఇరుక్కొని కాలక్షేపం చేసేస్తాను" అనుకొంటూ ఇంజన్ వైపు నడిచేడు రాజు. చివరిదాకా నడిచి "అదృష్టం బావుంది" అనుకున్నాడు. ఆఖరి కంపార్టుమెంటు చాలా ఖాళీగా ఉంది. కిటికీలోంచి లోనికి చూస్తే వెనకవైపు కిటికీదగ్గర కార్నర్ సీట్లో ఎవరూ ఉన్నట్టుగా లేదు. మరీ అదృష్టం!

"నా అదృష్టం బావుందీ రోజున" అని సంతోషిస్తూ లోనికి ఎక్కబోయాడు రాజు.

అతనికంటె ఒక్కడుగు ముందయేడు పచ్చకోటువాడు. ముందవడంలో తిన్నగా బోయి వెనక కిటికీ కార్నర్ సీట్లోనే కూర్చున్నాడు. అగ్గిరాముడై పోయాడు రాజు.

"నేనెక్కడ ముందుగా వెళ్ళి అక్కడ కూర్చుంటానో అని జోరుగా పరుగులెత్తిపోయి మరీ కూర్చున్నాడు దొంగవెధవ!" అని అతణ్ణి మనసులో తిట్టుకొంటూ, గత్యంతరంలేక అతనికి ఎదటసీట్లో కూర్చున్నాడు. కొంచెం సర్దుకొని, టిక్కెట్టు పర్సులో భద్రంగా పెట్టి, పర్సు జాగ్రత్తగా జేబులో పెట్టి, చెప్పులు కిందని విడిచి మఠం వేసుక్కూర్చొని కంపార్టుమెంటంతా కలయజూసేడు. ప్రయాణీకులంతా కలిపి పదిమందికంటె ఎక్కువలేరు. అంత తక్కువమంది ఉన్నప్పుడు కూడా తనకి కిటికీపక్క కార్నర్ సీటు దొరకనందుకు రాజుకి మహ చెడ్డ చిరాకు వేసింది. కోపం కలిగింది. పచ్చకోటువాణ్ణి చూస్తే వళ్ళు మండుకొచ్చింది.

ముందు కిటికీదగ్గర ఈ వెధవ సుఖంగా కూర్చున్నాడు.

వెనక కిటికీదగ్గర ఇంకో వెధవెవడో అంత సుఖంగానూ కూర్చున్నాడు.

మధ్య తను!

ఎదటివాడివైపు చురచుర చూసేడు.

ఎదటవాడు తొడుక్కున్న పచ్చకోటు చెప్పలేనంతగా మాసింది. అతను తొడుక్కున్న షర్టుమాత్రం తెల్లగా పువ్వులా ఉంది. కట్టుకున్న మాసీమాయని పంచె అక్కడక్కడ చిరిగింది. నెత్తిమీద పెట్టుకున్న మరాఠీ టోపీకింద జుట్టు బాగా పండినట్టు కనిపిస్తోంది. అతని వయసు నలభై సంవత్సరాలకి మించకపోవచ్చు. ముక్కు చాలా యెత్తుగా ఉండడంచేతా, కళ్లు చాలా లోతుకుపోవటంచేతా మనిషి గెద్దలా ఉన్నాడు. అతను ఎవ్వరివైపూ చూడ్డం లేదు. కిటికీలో ఎడం చెయ్యి ఆన్చుకొని, కాల్తూన్న సిగిరెట్టు కుడిచేత్తో పట్టుకొని యేదో ఆలోచిస్తూ కూర్చున్నాడు.

"వీడి పిండాకూడు గాని పచ్చరంగుకోటు తొడుక్కోడం ఏమిటీ" అని రాజు అనుకుంటూండగా ట్రెయిన్ కదిలింది. రాజు న్యూస్‌పేపరు తీసేముందు చుట్ట ముట్టించేడు.

పేపర్లో అతనికి నచ్చిన వార్తలేవీ కనిపించడం లేదు.

మలయా పరిస్థితి గురించి భారతం అంత గ్రంధం రాసేరు. కొరియా యుద్ధంగురించి చేటభారతం అంతరాసేరు. ఎవడిక్కావాలీ వెధవగోల. దీనికి బదులేదైనా బొమ్మల పుస్తకమైనా కొనుక్కోవలసింది. ఛీఛీ... ధూధూ...

అనుకుంటూ ఉమ్మికొంది లేచేడు రాజు.

ఇదో గొడవ. ఉమ్మికోడానికి మాటిమాటికీ లేచి కిటికీ దగ్గిరికి పోవాలి.

అక్కడే కూర్చుంటే ఎంత బావుండేది!

ఆ వెధవ హాయిగా కూర్చున్నాడు. వాడిపక్కనే కిటికీ వైపు కూర్చుంటేనేం? అలా చేస్తే ఈ ఉన్న కార్నర్ సీటు కూడా వదులుకోవాలి. మరెవడైనా ఒచ్చి తిష్టవేస్తాడు. దూరప్రయాణమాయె తనది.

కూర్చున్నాక తిరిగి చదవబోయేడు.

కొరియన్ వార్, ట్రూమన్స్ స్పీచ్, వాంటెడ్ కాలమ్స్, సోప్ అడ్వర్టయిజ్ మెంట్స్-ఛస్ ఎవడిక్కావాలీ వెధవ ఘోష. మరో బేడ్డబ్బులు పారేస్తే మంచి సినిమా పుస్తకం అయినా ఒచ్చును బొమ్మల్తో సహా అని పేపరు మడత పెట్టేశాడు. ఇంకేమీ చేసేది లేక అటూఇటూ చూస్తూ కూర్చున్నాడు చుట్ట కాలుస్తూ.

ఏదో స్టేషను దగ్గరవుతున్నట్టుంది.

ఈ పాడుబండీ ప్రతిపూళ్ళోనూ ఆగేట్టుంది. ఈపక్కని వెళ్తే పెళ్ళయిన పదోనాటికి చేరేట్టున్నాను అక్కడికి. కిటికీ వార కళ్ళుమూసుకు పడుకున్నా బావుణ్ణు.

ఎక్కడ దిగుతాడో గాని వాడు దిగిపోతే బావుణ్ణు.

"మీరెక్కడండీ దిగుతారూ?" అని పచ్చకోటు వాణ్ణి ప్రశ్నించేడు.

అతను జవాబు చెప్పలేదు. రాజు వేసిన ప్రశ్న విన్నట్టుగానే లేదు. ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. సిగిరెట్టు మాటిమాటికీ పీలుస్తున్నాడు. ఎండిపోతూన్న పెదవుల్ని నాలికతో తడిచేసుకుంటున్నాడు. కూర్చున్న చోట్లోనే అటూఇటూ కదుల్తున్నాడు. లోతుకుపోయిన కళ్ళతో లోపల లోతుల్లోకి చూసుకుంటున్నాడు.

ప్రశ్న వేస్తే జవాబు చెప్పడేం?

"ఏమండోయ్ మిమ్మల్నే" అని గట్టిగా అరిచేడు రాజు.

సుఖంగా నిద్రపోదామని సిద్ధమయేసరికి పక్కనున్న వాళ్లు అల్లరిచేస్తే ఎంత కోపంగా ఉంటుందో అంత కోపం వచ్చినట్టుగా ఉంది పచ్చకోటువాడి ముఖం.

"ఏం, ఎందుకూ?" అని విసుగ్గా అడిగేడు.

"ఏ వూరు వెళ్తున్నారూ?"

"ఎక్కడికో అక్కడికి వెళ్తాను. మీకేల? దయచేసి మీ మానాన్న మీరు కూర్చోని నా మానాన్న కూర్చోనివ్వండి."

అతను చాలా విసుక్కున్నాడు. తలమీద టోపీ తీసి విసుగ్గా బల్లమీద పడేశాడు. అతను చెప్పిన సమాధానానికి వెనక సీట్లో ఎవ్వరో నవ్వినట్టుగా అనిపించింది రాజుకి.

ఏవిటీ, వీడి పొగరూ!

ఏవిటీ వీడి పోయీకాలం!

ఎంత తెగులుగా వుందీ దౌర్భాగ్యపు వెధవకి!

దౌర్భాగ్యపు వెధవ వైపు కొరకొరలాడుతూ చూసేడు రాజు. టోపీ తీసేయడంతో అతని ఎండిన పండిన పీచుజుట్టు గాలికి ఎగురుతూ చెదురుతోంది. చెవులు బాగా పెద్దవిగా కనిపిస్తున్నాయి. అతని గడ్డం బాగామాసింది. రాజుకంటికి అతను చాలా వికృతంగా

కనిపించేడు.

చెవల వెధవ! మర్యాదా మప్పితం తెలీదు. జవాబివ్వలేడేం సరిగ్గా? పోనీ నాకేం లోటొచ్చింది? 'జాతి చూపరా బసవా' అన్నట్టు వాడిగుణం వాడు చూపించుకున్నాడు. కాని ఎదురుగా ఇలా దిష్టిపిడతలా రోజల్లా కూర్చునే ఉంటాడు కాబోలు.

లోలోపల మండిపోతూ కూర్చున్నాడు రాజు.

ఈ వెధవాయ్యంగారు ఎక్కడికెళ్తే నాకేం? ఎక్కడికో అక్కడి పోతాడు. వల్లకాట్లోకి వెళతాడు. వెళ్ళనీ నాకేల? కాని, పెట్టే బేడా యే గుడ్డా తెచ్చుకోలేదే వీడు. వీడివాటం చూస్తే టిక్కెట్టు కొన్నవాళ్ళాలేడు. అందుకనే యిందాకా గేటు దగ్గిర అలా హడావుడిగా తోసుకొని దాటీసేడు.

టికెట్ కలెక్టరొస్తే వీణ్ణి దింపించి పారెయ్యచ్చు.

ఒక స్టేషనప్పుడే దాటిపోయింది. కాని టీ.సీ. ఇంకా రాడేం? ఎవడూ కనిపించడే! పూర్వం ఇలానే ఉండేదా? అడుగడుక్కీ ఒచ్చి చెక్ చేసేవారే, ఇప్పుడంతా ఇలా తగలడుతూందేం? ఛీ, ఛీ! డబ్బిచ్చి వచ్చినవాడు బాధపడ్డం! కాణీ ఇవ్వకుండా వచ్చినవాడు సుఖపడ్డం! ఇలా అయితే యెలా చావడం? ఆనెస్ట్ పీపుల్ కష్టపడి నష్టపోవల్సివస్తోందని ఎవడూ గుర్తించడే! చాహ్!

పచ్చకోటువాడు దగ్గడం ప్రారంభించేడు బాధగా, కఫంగా. అసహ్యంగా దగ్గి దగ్గి కిటికీలోంచి పైకి ఉమ్మేసి కోటు చేత్తో మూతి తుడుచుకుని "అమ్మయ్యా" అని ఆయాసం తీర్చుకున్నాడు.

వీడికి క్షయరోగం ఉన్నట్టుంది. సంకటాల వాళ్ళని ట్రెయిన్‌లోకి ఎందుకు రానిస్తారో! అథారిటీస్‌కి బుద్ధుల్లేవు. వీడికి టీ. బీ. వుంది. అనుమానం లేదు. చచ్చేట్టున్నాడు. ఈ వెధవ ఈ క్షణంలో చస్తే నేనయి విచారించను. భూభారం ఎంత తగ్గినా తగ్గడమే!

మరో స్టేషన్ వచ్చింది. ట్రెయిన్ ఆగింది. ఇద్దరు బికార్లు దిగిపోయారు. ఈ బికారి కూడా యిక్కడ దిగిపోతే బావుణ్ణు అని రాజు అనుకొంటూ ఉండగానే పచ్చకోటు వాడు యేదో నిశ్చయానికి వచ్చినట్టుగా గభాల్న లేచి, కంపార్ట్‌మెంటు వెనక గుమ్మంలోంచి వెనకవైపుకి దిగిపోయేడు.

పోయేడు ఫకీరు వెధవ! నిజంగా పోయినట్టేనా? టోపీ వదిలీసేడే! మళ్ళీ వస్తుంది కాబోలు శనిదేవత. టీ. సీ. వస్తాడని భయపడ్డాడో యేమో?

రెండో వైపుకి తిరిగి చూస్తే ప్లాట్ ఫారం కనిపిస్తోంది. ప్లాట్ ఫారంమీద మనుష్యులు లేరు. అటువైపు కిటికీ దగ్గర అంతవరకూ కూర్చున్నవాడు హాయిగా పడక వేశాడు. వాడంత హాయిగా పడుకోవడం చూసి బాధపడలేక ముఖం తిప్పుకున్నాడు రాజు.

బండీ కదుల్తే బావుండుననుకొంటూ లేచి ఎదట కిటికీలోంచి పైకిచూసేడు.

ఇడుగో పచ్చకోటువాడు. ఇక్కడే నిల్చున్నాడు మాసిన పచ్చకోటూ వీడూను. బండీ కదలటం భయం మళ్ళీ బైటాయిస్తాడు. టీ.సీ. రావాలి, వీడి పని పట్టించాలి.

అతణ్ణి చూస్తూ అలానే నిల్చుండిపోయాడు రాజు కిటికీ దగ్గర. పగలు పదిగంటల చలికాలపు ఎండలో పచ్చకోటువాడు ప్రశాంతంగా గంభీరంగా నిల్చున్నాడు. గర్వంగా ఠీవిగా పొడవుగా ఉన్నాడు. అతని కళ్ళల్లో వెలుగు కనిపిస్తోంది. అతన్లో యేదో తేజస్సు ప్రజ్వరిల్లుతూన్నట్టుగావుంది. జగత్తుసంతా జయించినట్టుగా చూస్తున్నాడు. నిర్లక్ష్యంగా నిటారుగా నిల్చున్నాడు.

అబ్బోసి, వీడికి ఇంత డాబు ఎక్కణ్ణించి వచ్చింది –

అని రాజు అనుకుంటూ ఉండగానే ఇంజన్ గర్జించింది. గాడీ కదిలింది.

పచ్చకోటువాడు బండీ ఎక్కడానికి తొందర పడలేదు. నిల్చున్న చోటునుంచి కదల్లేదు.

వీడిక్కడే ఉండిపోతాడు, బ్రతికేను.

ట్రెయిన్ పదిగజాలు నడిచింది. పాతిక గజాలు దాటింది. అంతే!

అర్రె అదేమిటదేమిటి?!!

పచ్చకోటువాణ్ణి చూస్తూన్న రాజు ఒక్క కేకవేశాడు. ఎవరో ఛెయిన్ లాగారు. కర కరమని కీచు కీచుమని ఏడుస్తూ బండీ ఆగింది.

ముఖం తిరిగింది రాజుకి. మూర్ఛ వచ్చేట్టయింది రాజుకి.

పచ్చకోటువాని మెడ రైలు పట్టాపైన, ట్రెయిన్ చక్రాల క్రింద; ఇనప పట్టాలపైన, ఇనప చక్రాల దిగువ; అవతల తల; ఇవతల మొండెం; ఇందాట్లా ప్రాణం, ఇప్పుడిప్పుడే మరణం!

ఒక్కసారిగా, ఒకేసారిగా, అయ్యయ్యో, అయ్యో, అయ్యో, ఎంత పనెంతపని చేశాడు, ఎలా ఎలా ఎలా చేశాడు, శంకరా హరహరా, ఈశ్వరా సర్వేశ్వరా!

బండీలోఉన్న జనం అంతా వెనకవైపుకే దిగుతున్నారు. గోల గోల ఒకటే గోల, పోలీసులు, టీ.సీ.లు, ప్యాసింజర్లు కేకలు.

'ఇటువంటి సీన్సు నే చూడలేను.' అనుకుంటూనే, చేత్తో సంచిపట్టుకుని, బండిదిగి అటువైపుకి తొందరగా, గాబరాగా నడిచాడు రాజు.

"అబ్బ! ఒక్క సెకండే చూశాను. కా న్నాకీ జన్మలో నిద్రపట్టదు" అని ఎటూ వెళ్ళక మధ్య నిల్చున్న పెద్దమనిషి ఎవరితోనో అంటున్నాడు.

అందర్నీ అటువైపునుంచి తోసుకు వస్తూన్న కూలి మనిషిలా కనిపించే ఆడమనిషి వెక్కి వెక్కి యేడుస్తూ వస్తోంది.

"ఏమౌతాడమ్మా? నీ కతడేమౌతాడు?" అని పది మంది ప్రశ్నించారామెని.

"ఏమవుతాడు బాబూ! మీ కేమవుతాడో నాకూ అదే అవుతాడు. నిండు ప్రాణమా, మరేవన్నానా! పోతే ఏడుపు రాదూ?" అన్నదామె కళ్ళు తుడుచుకుంటూ. ఆ జవాబుని వినని వాళ్ళు ఆమెని ఇంకా ఏదో అడుగుతున్నారు.

"అవునండీ అతనే! నా ఎదట కూర్చున్నాడు. ఒక్తి బికార్లా ఉన్నాడు. ఏ వూరు వెళ్తున్నావని అడిగాను. ససేమిరా చెప్పాడు కాడే! మనిషి వాటం చూస్తే అప్పుడే వింతగా తోచింది నాకు" అని అందరితో చెప్తూన్న వీడెవడు?

వీడు ఇందాట్లా వెనక్కిటికే కార్నర్ సీట్లో కూర్చున్నవాడు.

ఎక్కడికి వెళ్తున్నావని నేను కదా అడిగాను! మరి వీడెందుకిలా చెప్తున్నాడు?

గొప్పకి! గొప్పకోసం అలా చెప్తున్నాడు.

చచ్చిపోయిన వాణ్ణి చచ్చిపోయేముందు పలకరించానని చెప్పినవాడితో మాట్లాడ్డానికి జనం తోసుకు ఛస్తున్నారు.

పది గంటలయింది. ఎండ తీవ్రంగా లేదు. కాని చుట్టూ అంతా సుస్పష్టంగా, కాతిమయంగా, కడిగేసినట్టుగా కనిపిస్తోంది. దూరాన్నుంచి వస్తోన్న రైలు పట్టాలు నాగుపాముల్లా మెరుస్తున్నాయి. ఏం చెయ్యాలో తోచని పోలీసు వాడి చుట్టూ, ఎర్రటి, నల్లటి, పచ్చటి ముఖాలు, కలవరంతో, ఆశ్చర్యంతో, అసహ్యంతో, బాధతో, క్యూరియాసిటీతో తిరుగుతున్నాయి.

దగ్గరగా వెళ్ళలేక కొంచెం దూరాన్న నిల్చొని చూసేడు రాజు.

చుట్టూ చేరినవాళ్ళ మధ్యలోంచి చనిపోయినవాని అరిపాదాలు మాత్రం కనిపిస్తున్నాయి.

అరిపాదాలేనా? నిజంగా చనిపోయిన మనషివేనా? ఎన్నాళ్లు ఎన్ని బాధలు పడ్డ మనిషిని ఎలా మోసుకు తిరిగేయవి?

"ఇహ నే చూడలేను బాబూ" అనుకున్న రాజు, వెనక్కి ఇంజన్ వైపుకి మళ్ళేడు. కంపార్టుమెంటులోకి పోయి తన సీట్లో కూర్చున్నాడు.

చుట్టూ చూస్తే ఇంకా ఎవరో కొత్త పాసెంజర్లు కూడా వచ్చి కూర్చున్నట్టుంది. కొంచెం ఆలస్యంచేస్తే తన సీట్లోకూడా ఎవరో వకరు కూర్చొనే ఉందురు. వేగిరం రావడం నయమే.

ఎదట కార్నర్‌సీట్లో నామాలు పెట్టుకున్న ముసలాయన కొత్తగా వచ్చి కూర్చున్నాడు. రాజు కూర్చున్నాక రెండుక్షణాలు పోనిచ్చి ఎవర్నీ ఉద్దేశించకుండా "ఈ టోపీ ఎవరిది చెప్మా?" అన్నాడు.

"పోయేప్పుడుకూడా నెత్తిమీద టోపీ ఉండాలా?" అన్నాడు రాజు.

ముసలాయన రాజువైపు ప్రశ్నార్థకంగా చూసేడు.

"ఆ చచ్చిపోయిన మనిషిదండీ ఆ టోపీ! తొందర్లో వదిలేసి ఏకంగా దిగిపోయేడు."

"ఇక్కడేనా ఏవిటి ఆ మనిషి కూర్చొంట?" అని, టోపీకి కొంచెం ఎడంగా జరిగి కూర్చున్నాడు నామాలవాడు.

"ఆహా! ఆ సీట్లోనే, సరిగ్గా మీరుకూర్చున్న చోటే"

నామాలవాడు కొంత తటపటాయించి, ఏదో పనున్నట్టుగా లేచి, గేటువైపు వెళ్ళి అక్కడ కూర్చున్నాడు.

చావంటే ఎంత భయం! చనిపోయినవాడి సీట్లోనే కూర్చొందికి భయం; అనుకున్న రాజు, తనకావలసిన సీట్లో కూర్చొనే అవకాశం వచ్చినా తను కూర్చోడం లేదని గుర్తుంచుకోనే లేదు.

"ఆ టోపీ నిజంగా అతన్దేనండీ?" అని యెవరో అడిగేరు.

"అవును మహాశయా."

"పాపం."

తెగ్గొట్టిన తలలా అలా పడే ఉంది టోపీ. అందరూ భయపడుతూ చూసేరు. ఎవ్వరూ తియ్యలేదు, ముట్టుకోలేదు.

ట్రెయినింకా కదలలేదు, ఇంకా ఆలస్యం అవుతుంది కాబోలని ఎవరో విసుక్కుంటున్నారు.

కిటికీలోంచి పైకి చూస్తున్నాడు రాజు.

ఆకాశం చెప్పలేనంత నీలంగా ఉంది. కొంచెం దూరంలో, మామిడి తోటలకీ, తాటితోపుకీ వెనక కనపడీ కనపడక దాగుంది ఏదో వూరు. సన్నగా ఆ వైపునుంచి లేచినపొగ అక్కడే నిల్చిపోతోంది. మామిడిచెట్లకి ముందున్న చెరువుగట్టున స్నానం చేసిన వృద్ధుడెవరో గామంచాతో తుడుచుకుంటున్నాడు, స్టేషన్ వైపుచూస్తూ. దూరానికి ఆకుపచ్చగా కనిపిస్తూ, తెల్లటిచుక్కల్లాంటి బాతులు యీదే చెరువునీటిలో, దూరంగా అచలంగా నిల్చున్న నీటికొంగలూ, ఎండలో మంచుతెరల్లా కనిపించే తెల్లమబ్బులూ కదిలిపోతున్నాయి. చెవులకి పక్కగా ఉన్న తాటాకుల ఇంటిముందు విరగపూసిన గన్నేరు చెట్టు బరువుగా కొమ్మలు వంచుకొంది. బాగా ఎదిగిన అమ్మాయెవరో నీలంగా ఉన్న చీర చెంగులోకి కెంపుల్లాంటి పువ్వుల్ని తెంపి పడేసుకొంటోంది. కోతకి సిద్ధంగావున్న వరిచేల మధ్యనుంచి పల్లెపడుచెవరో పోతోంది వయ్యారంగా నడుచుకొంటూ.

దూరంనుంచి, రాజు కూర్చున్న స్థలంనుంచి చూస్తోంటే అంతా ప్రశాంతంగా,

హాయిగా కనిపిస్తోంది. చిన్నగా, సొంపుగా రంగుల బొమ్మలా ఉంది. తెల్లటి ఆర్టు పేపర్ మీద ముచ్చటగా ముద్రించిన త్రివర్ణ చిత్రంలా ఉంది. ఎంతో మనోహరంగా వుంది.

అవన్నీ, అదంతా చూస్తోన్న రాజు మనసెందుకోగాని విచారభరిత మయింది. పచ్చకోటువాణ్ణి పరమ శత్రువుగా భావించిన సంగతి మర్చేపోయాడు. ఆ సమయంలో, అలా కూర్చుని చూస్తోంటే అకారణంగా అతని కళ్ళు చెమ్మగిల్లాయి. అతనికి మిక్కిలి దిగులు కలిగింది.

ఈ నీలపు కొండలూ, ఈ నీలి ఆకాశం, ఈ శీతాకాలపు ఎండా, ఆ బాతులు యీదే చెరువూ, స్నానం చేసిన వృద్ధుడూ, యెక్కడికో పోతోన్న పల్లెపడుచూ, పువ్వులు కోసే జవ్వనీ, యేదీ; యేదీ; ఎవర్నీ కూడా చూడలేదే పచ్చకోటువాడు.

ప్రాణాల్ని ఇనప పట్టాలమీద పోగొట్టుకున్న పచ్చకోటువాడు ఈ జీవితంలో యెట్టి బాధల్నీ చూడలేక, భరించలేక, సహించలేక చివరికీ రోజున ప్రాణాల్ని తీసేసుకున్నాడు కదా!

అని రాజు అనుకొంటూ ఉండగా ఇంజన్ పెనుబొబ్బ పెట్టింది. రెయిల్ గాడీ కదిలింది, నడిచింది, పరుగుతీసింది.

ఎండలో మిలమిల్లాడుతూ పరిగెడుతూన్న టెలిగ్రాఫ్ తీగెలవైపూ, చూడక వెనక్కి గాభరాగా జరిగిపోతోన్న స్తంభాలవైపూ చూస్తూ కూర్చున్న రాజుకి గుండెల్లో ఎంతో బరువుగా, మనసులో యెంతో దిగులుగా యెందుకుందో టెలిగ్రాఫ్‌సరిగా అర్థం కాలేదు.

ఆంధ్రపత్రిక వారపత్రిక, 18–2–1953.